క్లుప్తంగా

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

55,962 మందికి లబ్ధి

గాజువాక: వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను గాజువాక నియోజకవర్గంలో మంగళవారం పంపిణీ చేయనున్నారు. ఈ విడతలో నియోజకవర్గంలోని 5,483 పొదుపు సంఘాలకు చెందిన 55,962 మంది మహిళలు లబ్ధి పొందనున్నారు. ఈ పథకం కింద రూ.37కోట్ల 44లక్షల 78వేల 271 మంజూరైనట్టు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి చేతులమీదుగా చెక్కులను అందజేయనున్నామని చెప్పారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని స్వామి అయ్యప్ప ఆలయంలో విద్యార్థులకు సోమవారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన అయ్యప్పస్వామి జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జయంత్యుత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు రెండు రోజుల పాటు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. చిత్రలేఖన పోటీల్లో శబరి విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు చరపాక నాగార్జున రాజు, నంబారు రాజు, విశ్వేశ్వరరావు, బొడ్డు అప్పల స్వామి, దువ్వాడ శ్రీనివాసరావు, భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు కుటుంబానికి ఏసీపీ పరామర్శ

అక్కిరెడ్డిపాలెం: ఇటీవల మరణించిన సీపీఎం నాయకుడు జి.సుబ్బారావు కుటుంబాన్ని ఏసీపీ త్రినాథ్ సోమవారం పరామర్శించారు. షీలానగర్‌లోని సుబ్బారావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుబ్బారావు మృతికి సంతాపం తెలిపారు. ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు.

అయ్యప్ప స్వామి జన్మ నక్షత్ర పూజలు రేపు



ఉక్కునగరం: శబరిగిరీశుడు అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నారు. స్వామి జన్మనక్షత్రం ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో ఉదయం 6 గంటలకు అష్ట ద్రవ్య గణపతి హోమం, 7 గంటలకు వివిధ రకాల ఫలాలతో నవఫలాభిషేకం చేయనున్నారు. అనంతరం స్వామికి విశేషాలంకరణ చేయనున్నారు. తిరు ఉత్సవం, ఆరాట్టు పూజ, హారతి అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ప్రధాన అర్చకులు నాగేశ్వర శర్మ తెలిపారు.

'బోగస్ ఆర్ కార్డులపై విచారణ చేపట్టాలి'

అగనంపూడి: బోగస్ ఆర్ కార్డులతో ఉద్యోగాలు పొందిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు కలెక్టర్‌ను కోరారు. ఐదేళ్ల నుంచి ఫిర్యాదు చేస్తున్నామని పేర్కొన్నారు. అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుని, వాస్తవాలు బయటకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే బాండ్ పేపర్‌పై వాంగ్మూలం రాసిస్తానని తెలిపారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలు బయటకు తేవాలని, కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

స్వర్ణపుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ వర్గాలు తెలిపాయి.

'పది' పరీక్షలు ప్రారంభం

- పకడ్బందీగా పోలీసు బందోబస్తు



గంగవరం జెడ్పీ హైస్కూల్ వద్ద టెన్త్ క్లాస్ విద్యార్థుల సందడి



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



కణితి హైస్కూల్లోని పరీక్ష హాల్లో కూర్చున్న 10వ తరగతి విద్యార్థులు

గాజువాక: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు సోమవారం తెలుగు పరీక్ష రాశారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా లోపలికి అనుమతించేది లేదన్న నిబంధనతో విద్యార్థులంతా ఉదయం 8 గంటల నుంచి పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. 8.45గంటలకు వారికి కేంద్రం లోపలికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు ఆంక్షలను పటిష్టంగా అమలు చేశారు. స్క్వాడ్ సిబ్బంది పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

గాజువాక మండలంలో ముగ్గురు గైర్హాజరు

గాజువాక మండల ప్రాంతంలోని 20 పరీక్షా కేంద్రాల్లో 4,335 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, ముగ్గురు విద్యార్థులు మినహా మిగిలిన వారంతా పరీక్షకు హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. చైతన్యనగర్‌లోని కేంద్రాల వద్ద యథావిధిగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఆ ప్రాంతంలోని పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రతి పరీక్ష కేంద్రంలోను మంచి నీరు, విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, సరిపడినన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదని మండల విద్యాశాఖాధికారి నాయుడు తెలిపారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో 198 పరీక్షకు హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారని ఇన్‌చార్జి ఉషారాణి తెలిపారు. 10 రూముల్లో పరీక్షలు నిర్వహించామని చెప్పారు. మింది జిల్లా పరిషత్ పాఠశాలలో 200 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ తెలిపారు. విద్యార్థులకు మంచినీరు, ఫర్నీచర్, ఫ్యాన్లు, లైట్లు తదితర వసతులు ఏర్పాటు చేసి, ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు చెప్పారు.

85, 79 వార్డుల్లో..

అగనంపూడి: జీవీఎంసీ 85, 79 వార్డుల్లోని అగనంపూడి, లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ పరీక్షలు నిర్వహించారు. అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి 165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో గతంలో అగనంపూడి పరీక్ష కేంద్రంలో పరీక్షలకు హాజరైన పిన మడక, ఏబీఎస్ పాఠశాలల విద్యార్థులు ఈ ఏడాది నుంచి లంకెలపాలెం, పెదముషిడివాడ హైస్కూళ్లలోని కేంద్రాలకు హాజరయ్యారు. నంగినారపాడు హైస్కూల్ విద్యార్థులు కూడా ఈ ఏడాది సబ్బవరం హైస్కూల్లో పరీక్షలు రాశారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెదముషిడివాడ, లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు నాలుగు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఇక్కడ పరీక్ష కేంద్రం కేటాయించారు. లంకెలపాలెం ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు పరీక్షల కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రౌతు నాగేశ్వరరావు, డీఓ మూర్తి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బందితో పాటు వార్డు సచివాలయ మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కణితి హైస్కూల్లో ఒకరు గైర్హాజరు

కూర్మన్నపాలెం: కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో మొత్తం 190 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 189 మంది హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు పేపర్‌కు ఒకరు మాత్రమే గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. స్థానిక రవీంద్రభారతి ప్రైవేట్ పాఠశాలలో 153 మంది, నిర్మల ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 190 మంది పరీక్షకు హాజరయ్యారు.

పెదగంట్యాడ మండలంలో..

పెదగంట్యాడ: మండలంలోని మూడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లోని నాలుగు సెంటర్లలో, రెండు ప్రైవేటు పాఠశాలల్లోని రెండు సెంటర్లు కలిపి మొత్తం ఆరు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1242 మంది విద్యార్థులకు గాను 1234 మంది హాజరయ్యారు.

- నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ–సెంటర్‌లో నిర్వహించిన పరీక్షలకు 226 మంది విద్యార్థులకు గాను 223 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు.
- నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బీ సెంటర్‌లో 254మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారు.
- ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 182 మందికి 179 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హజరయ్యారు.
- గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 115 మందికి గాను 114 మంది హాజరయ్యారు. ఒకే ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు.
- బీసీ రోడ్డులోని చైతన్య స్కూల్‌లో 215 మందికి 214 మంది హాజరు కాగా, ఒకరు హాజరు కాలేదు.
- గంగవరం రోడ్డులోని విశాఖ విమల విద్యాలయంలో 250 మంది విద్యార్థులకు గాను మొత్తం విద్యార్థులు హాజరయ్యారు.

విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచారు. పోలీసు బందోబస్తు నిర్వహించారు.



గాజువాక హైస్కూల్ కేంద్రంలో రోల్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసుల బందోబస్తు



అగనంపూడి హైస్కూల్ గేటు వద్ద వేచి ఉన్న పదో తరగతి విద్యార్థులు

15 నుంచి ఉక్కు నిర్వాసితుల పాదయాత్ర



నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15 నుంచి పాదయాత్ర చేపట్టనున్నామని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి తెలిపారు. పెంటమాంబ ఆలయం వద్ద నిర్వాసితులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 780 రోజులుగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే కార్యక్రమంలో భాగంగా పాదయాత్రను తలపెట్టామన్నారు. ఈ యాత్ర ఈ నెల 15న ఉదయం నడుపూరు గాంధీ విగ్రహం నుంచి సింహాచలం దేవస్థానం వరకూ నిర్వహించనున్నామని వివరించారు. ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నమ్మి సింహాద్రి, ధర్మాల కనకరెడ్డి, నంబారు సింహాద్రి, నామాల శ్రీకాంత్, రామిరెడ్డి, గొందేశి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



పోలయ్యను సత్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: ఏ ఉద్యోగికైనా చేసిన సేవలే గుర్తింపును ఇస్తాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. ఉక్కు కర్మాగారంలో నాలుగు దశాబ్దాలుగా సేవలందించి, ఉద్యోగ విరమణ పొందిన సీపీఐ నాయకుడు పల్లేటి పోలయ్యను సోమవారం ఘనంగా సత్కరించారు. పోతిన సన్యాసిరావు భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, తాంద్ర కనకరాజు, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని, 150 యూనిట్ల రక్తం దానం చేశారు. లక్ష్మీనారాయణ ఫౌండేషన్, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా భావం పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, వివిధ విభాగాల డీన్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రాత్రయినా ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ



మిందిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దీప్తి

అక్కిరెడ్డిపాలెం: పింఛన్ల పంపిణీ సోమవారం ప్రారంభమైంది. ఆర్థిక సంవత్సరం ముగింపు, ఆదివారం బ్యాంక్ సెలవుల నేపథ్యంలో సామాజిక పింఛన్ల పంపిణీని ఈ నెల మూడో తేదీన ప్రారంభించారు. జీవీఎంసీ 68వ వార్డు మిందిలో సోమవారం రాత్రి వరకు నిర్వహించిన పింఛన్ల పంపిణీలో గృహసారథులు, కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. వలంటీర్ దీప్తి, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ చిన హుస్సేన్ మిందిలో పింఛన్ అందజేశారు.

ఘనంగా పోలమాంబ తొలేళ్ల ఉత్సవం



పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

నేడు వార్షిక జాతర

పండగలో భాగంగా ప్రధాన ఘట్టం అనుపు మహోత్సవం, వార్షిక జాతర మంగళవారం జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలమాంబ ఆలయంలో పని చేస్తున్న 20 మంది సిబ్బందితో పాటు దేవదాయశాఖకు చెందిన సిబ్బంది 50 మంది వరకు ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రాథమిక వైద్య శిబిరం, ప్రసాదాల విక్రయాలకు ప్రత్యేక, అదనపు కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత, రూ.50, రూ.100, రూ.500 దర్శనాలు అందుబాటులో ఉంచారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఆలయ ఈవో సురేష్‌బాబా, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి తెలిపారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



వాహనచోదకుడికి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ యూసఫ్

అక్కిరెడ్డిపాలెం: వాహనచోదకులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరాలని గాజువాక ట్రాఫిక్ ఎస్‌ఐ యూసఫ్ సూచించారు. బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం ఆయన సిబ్బందితో కలిసి హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వాహనచోదకులను ఆపి, హెల్మెట్ ధరించక పోవడం వల్ల కలిగే పరిణామాలను ప్లకార్డుల సహాయంతో వివరించారు. హెల్మెట్ ధరించకపోవడంతో 2022 సంవత్సరంలో 147 మంది పలు రోడ్డు ప్రమాదాల్లో మరణించారని తెలిపారు. ట్రాఫిక్ సీఐ కె.సత్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు గాజువాక పరిధిలో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలియజేశారు.

నేరాలపై అప్రమత్తత అవసరం



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్‌ఐ మహేశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాజువాక క్రైం ఎస్‌ఐ మహేశ్వరరావు సూచించారు. నేరాలు, మోసాలపై 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద స్థానికులకు సోమవారం రాత్రి అవగాహన కల్పించారు. సెల్ ఫోన్ల చోరీ, వాహనాల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సెల్ ఫోన్లలో వచ్చే లోన్ యాప్‌ల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఆలయాల్లో, ఖరీదైన నివాసాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఊరు వెళ్లినప్పుడు తమకు సమాచారం అందిస్తే, ఆ ఇంటికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. క్రైం సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రైం హెచ్‌సీ సీహెచ్.సత్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు నిర్వీర్యం



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 781వ రోజు సోమవారం వివిధ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర ఉక్కుమంత్రికి 'సీ' వినతి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు, మూల ధనం కోసం స్టీల్ ప్లాంట్ ఇచ్చిన ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)లో పాల్గొనేలా సెయిల్‌కు ఆదేశాలు ఇవ్వాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, కేంద్ర ఉక్కు శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు సోమవారం లేఖ రాశారు. స్టీల్‌ప్లాంట్ 25 కి.మీ పరిసరాలతో రెండు మేజర్ పోర్టులతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ అని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 7.3 మి.టన్నులకు విస్తరించబడిందన్నారు. ఆర్థిక సంక్షోభం కారణంగా స్టీల్‌ప్లాంట్ వార్షిక సామర్థ్యాన్ని సాధించలేకపోతోందన్నారు. ప్రారంభం నుంచి ముడి ఇనుము, బొగ్గు గనులు లేకపోవడం వల్ల ఇతర కర్మాగారాల కంటే టన్నుకు రూ. 6 నుంచి 7 వేలు ఉత్పత్తి వ్యయం ఎక్కువ అవుతోందని తెలిపారు. సెయిల్ గంగవరం పోర్టు నుంచి కోకింగ్ కోల్‌ను దిగుమతి చేసుకుని రైలు ద్వారా రవాణా చేస్తోందని చెప్పారు. సెయిల్ ఈవోఐలో పాల్గోవడం వల్ల గంగవరం పోర్టుకు వచ్చే ముడి సరకును స్టీల్ ప్లాంట్‌కు ఇవ్వడం, తద్వారా స్టీల్‌ప్లాంట్ తయారు చేసే ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఇరు సంస్థలకు లాభదాయకమని పేర్కొన్నారు. ఈ అంశంపై సెయిల్ యాజమాన్యానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని లేఖలో కోరారు.


నూతన విభాగాధిపతికి అభినందనలు



స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పీ నూతన విభాగాధిపతిని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ) విభాగంలో సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకోవాలని స్టీల్ ఇంటక్ నాయకులు కోరారు. ఆర్ఎంహెచ్‌పీ నూతన విభాగాధిపతిగా పరుచూరి శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇంటక్ నాయకులు సోమవారం ఆయనను కలిసి, సత్కరించారు. ఈ సందర్భంగా విభాగం సమస్యలను నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు. విభాగంలో పదవీ విరమణ, మృతి చెందటం వంటి కారణాల వల్ల సిబ్బంది గణనీయంగా తగ్గిపోయారన్నారు. విభాగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బి.ఎస్. రాజు, ఎ. రాజేశ్వరరావు, గోవిందరాజు, ఎల్లాజీ, కొండ రాజు, వేమన రమేష్, సురేంద్రబాబు, కారి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాట కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్ వ్యూహం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తు వ్యూహాన్ని రూపొందించారు. సోమవారం సాయంత్రం స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 10న బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ కూర్మన్నపాలెం టెంట్ సందర్శిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, 15న పెదగంట్యాడ గాంధీ విగ్రహం నుంచి పాదయాత్రగా సింహాచలం కొండపైకి పాదయాత్ర నిర్వహించాలని, 25న ఉదయం 8 గంటల నుంచి సీఎండీ, డైరెక్టర్ల బంగ్లాలు ముట్టడించాలని నిర్ణయించారు. సమావేశంలో పోరాట కమిటీ చైర్మన్లు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ కె.ఎస్.ఎన్. రావు, కో–కన్వీనర్ జె. అయోధ్య రామ్, నీరుకొండ రామచంద్రరావు, వై. మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

6న మరిడిమాంబ మహోత్సవం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–5 లోని మరిడిమాంబ జాతర మహోత్సవాన్ని ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ ఆవరణలో మరిడిమాంబ భజన మండలి వారి భజన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం 5 గంటల నుంచి ఉక్కునగరం వీధుల్లో అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు. రాత్రి 7 గంటలకు గాజువాకకు చెందిన కృష్ణా అకాడమీ ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

'దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధం'

గాజువాక: దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ అసెంబ్లీలో చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకురాలు కట్ట పద్మ ఆధ్వర్యంలో గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ దళిత క్రైస్తవులు ప్రస్తుతం బీసీ సీలోఉన్నారని, వారిని ఎస్సీలో చేర్చడంవల్ల నిజమైన హిందూ ఎస్సీలు నష్టపోతారని పేర్కొన్నారు. నాయకులు ప్రకాష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.